క్లుప్తంగా

రెండు విడతలుగా వ్యవసాయ విద్యుత్ సరఫరా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని భీమడోలు–పెదవేగి ఫీడర్‌లో ప్రస్తుతం ఉన్న కండక్టర్‌ను మార్చడానికి గానూ ఈ నెల 27 నుంచి డిసెంబర్ 23 వరకూ ఆయా ప్రాంతాల్లో వ్యవసాయానికి రోజుకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించామని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. విజయరాయి, బాపిరాజు గూడెం, అయ్యపరాజు గూడెం, జానంపేట, పెదవేగి, కూచింపూడి, రామసింగవరం, రాయుడుపాలెం, కవ్వగుంట, ఆసన్నగూడెం, ధర్మాజీ గూడెం, ముండూరు, గాలాయగూడెం, చొదిమెళ్ళ, తంగెళ్ళమూడి, గుడిగుంట, జోగన్నపాలెం ప్రాంతాలకు రోజుకు రెండు విడతలుగా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

తల్లిదండ్రుల సమావేశం వాయిదా వేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఆనవాయితీ ప్రజల్లో ఉందని, కానీ అదే రోజున (డిసెంబర్ 7న) మెగా పేరెంట్స్ మీటింగ్ పేరిట తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వాయిదా వేయాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం డీఈఓ వెంకటలక్ష్మమ్మను ఆమె కార్యాలయంలో పీఆర్‌టీయూ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలలకు షష్టి రోజున స్థానిక సెలవు ప్రకటించుకునే పరిస్థితి ఉండేదన్నారు. షష్టి రోజున తల్లిదండ్రుల సమావేశానికి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను హాజరుపరచడం కష్టతరమని, దీనిపై పునరాలోచించి ఈ సమావేశాన్ని మరో రోజుకు వాయిదా వేయాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, నాయకులు ఎం. రాంబాబు, ఎస్‌డీ ముర్సలీన్ ఉన్నారు.

ఘనంగా రామం వర్ధంతి



రామం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): పట్టణంలోని పవర్‌పేటలో ఉన్న సీపీఎం ఏలూరు జిల్లా కార్యాలయంలో బుధవారం తొలితరం కమ్యూనిస్టు నాయకుడు ఉద్దరాజు రామం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్ సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు రామం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

జ్యూట్ మిల్లు కనుమరుగు

- వందేళ్లకు పైగా ఘన చరిత్ర
- ఏడు వేలకు పైగా కార్మికుల ఉపాధికి గండి
- యుద్ధ ప్రాతిపదికన తొలగింపు పనులు
- ఇప్పటికే పరిశ్రమ మొత్తం నేల మట్టం



జ్యూట్ మిల్లు లోపల పరిశ్రమ షెడ్లు, యంత్రాలను తొలగించిన దృశ్యం



జ్యూట్ మిల్లు ప్రవేశ ద్వారం, పరిపాలన భవనాలు మాత్రమే ఉన్న దృశ్యం

ఏలూరు (టూటౌన్) : వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఏలూరు జ్యూట్ మిల్లు కనుమరుగు కానుంది. సాధారణంగా ఏలూరు పేరు చెబితేనే ఇతర ప్రాంతాల వారికి గుర్తుకు వచ్చేది ఏలూరు జ్యూట్ మిల్లు. అంతటి చరిత్ర కలిగి ఉన్న ఈ ఫ్యాక్టరీ గురించి భవిష్యత్తు తరాల వారు కేవలం చరిత్ర పుస్తకాల్లోనే తెలుసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రెండేళ్ల క్రితం జ్యూట్ మిల్లు యాజమాన్యం నష్టాలు వస్తున్నాయని ఏలూరు జ్యూట్ మిల్లును మూసివేసింది. అప్పట్లో జ్యూట్ మిల్లుకు సంబంధించిన పలు కార్మిక సంఘాలు ఐక్యంగా ఎన్నో పోరాటాలు చేసినా యాజమాన్యం పట్టించుకోలేదు. కార్మిక శాఖ సైతం ఏమీ చేయలేక చేతులెత్తేసింది. దీంతో వేలాది మందికి జీవనోపాధి కల్పించినటువంటి జ్యూట్‌మిల్లు మూతబడి నేడు నేలమట్టం అవుతోంది. దీన్ని చూస్తున్న గతంలో ఇక్కడ పనిచేసిన కార్మికులు, పోరాటం చేసిన యూనియన్ నాయకులు ఆవేదన చెందుతున్నారు. జ్యూట్ మిల్లు ఆనవాళ్లు కూడా లేకుండా నేల మట్టం చేస్తుండడంపై ఏలూరు వాసుల్లో ఒకింత బాధ, ఆవేదన కనబడుతుంది.

యుద్ధ ప్రాతిపదికన కూల్చివేత పనులు

ప్రస్తుతం ఏలూరుజ్యూట్ మిల్లు ఆవరణలోని షెడ్లను, నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన కూల్చివేత పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మూడు వంతులు ఫ్యాక్టరీని యంత్రాల సాయంతో కూల్చివేశారు. కూల్చివేత సందర్భంగా వచ్చే ఐరన్‌ను స్క్రాప్‌గా తరలిస్తున్నారు. యంత్ర సామాగ్రిని సైతం అయిన కాడికి వదిలించేసుకుంటున్నారు. ఇక మిగిలింది పరిపాలన బ్లాక్, సెక్యూరిటీ బిల్డింగ్, వాటర్ ట్యాంక్, విద్యుత్ సబ్ స్టేషన్ మాత్రమే మిగిలి ఉన్నాయి. వీటిని కూడా కొన్ని రోజుల్లో కూల్చి వేసేందుకు మిల్లు యాజమాన్యం సిద్ధమవుతుంది. కూల్చివేత సందర్భంగా ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున దుమ్ముధూళి రేగుతుంది. నిత్యం వందలాది మంది కార్మికులు,యంత్రాలు కూల్చివేత పనుల్లో నిమగ్నమై ఉంటున్నారు.

వీధిన పడ్డ వర్కర్లు

ఏలూరు జ్యూట్ మిల్లు, కొత్తూరు జ్యూట్‌మిల్లు పరిధిలో సుమారు 7,500 మంది కార్మికులు మూడు షిఫ్టులలో పనిచేసేవారు. ఏలూరు జ్యూట్ మిల్లులో షిఫ్ట్‌కు 1500 మంది చొప్పున మూడు షిఫ్టులలో 4,500 మంది, కొత్తూరు జ్యూట్ మిల్లులో షిఫ్ట్‌కు 1000 మంది చొప్పున మూడు షిఫ్టులలో కలిపి 3 వేల మంది వరకు పని చేసేవారు. మొత్తంగా జ్యూట్ మిల్లులను మూసి వేయడంతో పాటు వాటి నిర్మాణాలను తొలగించడంతో కార్మికులంతా రోడ్డున పడ్డారు. వీరంతా ఉపాధి కోసం ఆటోలు నడపడం, పాత ఇనుము, ప్లాస్టిక్ కొనుగోలు చేసే పనులు, కూరగాయాలు, పండ్ల వ్యాపారులు గానూ, హోటల్స్‌లో వర్కర్లు గానూ, నైట్‌వాచ్‌మేన్‌లు, అపార్టుమెంట్ల కాపలాదారులుగా అవతారమెత్తి తమ జీవనాన్ని గడుపుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయాల వల్లే దుస్థితి



జ్యూట్ మిల్లు నిర్వహణకు అవసరమైన జనపనారను అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి రావడం, కేంద్ర ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు తీసుకోక పోవడం వంటి కారణాలతో జ్యూట్ మిల్లు పరిశ్రమ నష్టాల బాట పట్టింది. ఇక్కడ తయారైన గోనె సంచులను సైతం స్థానికంగా అమ్ముకునే అవకాశం లేక పోవడం మరో కారణం. కార్మికుల పక్షాన ఎన్ని సార్లు అధికారులు, ప్రభుత్వాలకు విన్నవించినా మూసివేతను అడ్డుకోలేకపోయారు. దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డునపడ్డారు.

– బి.జగన్నాథం, సీఐటీయూ నాయకులు, ఏలూరు

1975 నుంచి మూసి వేసే వరకు పనిచేశా



జ్యూట్ మిల్లులో 1975లో కార్మికునిగా చేరిన నేను మూసివేసేంత వరకు కార్మికుడిగా పని చేశాను. దాదాపు 46 సంవత్సరాలు జ్యూట్ మిల్లు కార్మికుడిగా పని చేశాను. ఇన్ని సంవత్సరాలు జ్యూట్‌మిల్లుతో అనుబంధం ఉన్న నేను ప్రస్తుత పరిస్థితి చూసి బాధ పడాల్సి వస్తుంది. దాదాపు 7,500 కార్మికుల కుటుంబాలకు అన్నం పెట్టిన పరిశ్రమ నేడు కనుమరుగైంది.

– జి.కోటేశ్వరరావు, జ్యూట్ మిల్లు కార్మికుడు, ఏలూరు

అందరూ ఐకమత్యంగా సాగాలి



కార్యక్రమంలో అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): బహుజనులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఏపీ ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బహుజన సేన ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ బహుజనులు హక్కుల కోసం పోరాటం చేస్తున్న బహుజన సేనకు అభినందనలు తెలియజేశారు. బహుజన సేన వ్యవస్థాపక అధ్యక్షులు మత్తే బాబీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ,ముస్లిం మైనార్టీ, కాపులు తలెత్తుకుని జీవించేలా ఆర్థిక సామాజిక సాంస్కృతిక క్రీడా పరంగా ఉన్నతంగా ఎదగాలని అన్నారు. మాజీ ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, నారా శేషు, తూము విజయ్ కుమార్, కొఠారు ఆదిశేషు, కార్పొరేటర్ బొద్దాని అఖిలప్రియ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి పథకం రైతులకు న్యాయం చేయాలి



భూ నిర్వాసిత రైతులసమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులకు పాత అవార్డు ప్రకారం పరిహారం ఇస్తానని అధికారులు చెబుతున్నారని, అతి తక్కువ పరిహారం ఇచ్చి భూ నిర్వాసిత రైతులకు అన్యాయం చేయవద్దని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక అన్నే భవనంలో జరిగిన సమావేశంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతుల సమస్యలపై ఆయన మాట్లాడారు. 2015, 2016ల్లో అవార్డు ఇచ్చి ప్రభుత్వం వద్ద నిధులు లేవనే పేరుతో 9 ఏళ్ల తర్వాత అదే పరిహారం ఇస్తామని చెప్పడం తగదన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉందని, ఎన్నికల కోడ్ అనంతరం చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులతో జిల్లా ఉన్నతాధికారులు మాట్లాడతామని న్యాయం చేస్తామని చెప్పి ప్రస్తుతం రైతులతో సమావేశాలు నిర్వహించి పాత అవార్డు ప్రకారమే పరిహారం ఇస్తామని చెప్పడం తగదన్నారు. 2015– 16 అవార్డులను రద్దుచేసి కొత్త అవార్డు ప్రకారమే పరిహారం చెల్లించాలని, ప్రైవేట్ మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు రూ. 50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. చెట్లు, షెడ్లు, బోర్లకు తగిన పరిహారం అందించాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

కాలుష్యరహిత నగరంగా ఏలూరు



నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో) : వాయుకాలుష్య నియంత్రించేందుకు ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాల వినియోగంపై ప్రజలకు అవగాహన కలిగించి, వాటి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. నేషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రాం కింద కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వాయుకాలుష్య నియంత్రణ అమలుపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నానాటికీ పెరుగుతూ ప్రజారోగ్యానికి చేటు చేస్తున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఏలూరు నగరంలో చెత్త సేకరించే వాహనాలను ఎలక్ట్రిక్ లేదా సీఎన్‌జీ వాహనాలుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. నేషనల్ యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్స్ ప్రకారం దేశంలో సగటున వాయుకాలుష్యం 60 యూజీ లు కాగా, ఏలూరు నగరంలో ప్రస్తుతం 63 యుజీలు ఉన్నదని, దానిని 60 యుజీల కన్నా తక్కువ స్థాయికి తీసుకువచ్చి, ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్ కల్తీ జరగకుండా పౌర సరఫరాల అధికారులు గట్టి నిఘా పెట్టాలన్నారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.ప్రతాప్ శివ కిషోర్, జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్ కుమార్ కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, కన్సల్టెంట్ ఎ.కోమలి, సామాజిక వన విభాగం జిల్లా అటవీ శాఖాధికారి సీహెచ్. సూర్యనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.సత్యనారాయణరాజు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు,, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్, ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.

మహిళను ఇంటికి చేర్చిన పోలీసులు

ఏలూరు టౌన్: భర్తతో గొడవపడి ఇంటి నుంచి వచ్చి రైల్వే స్టేషన్లో ఒంటరిగా రోదిస్తున్న మహిళను గుర్తించిన రైల్వే పోలీసులు ఆమెను సంరక్షించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి బుధవారం అప్పగించారు. విశాఖపట్టణం జిల్లా గాజువాక వద్ద నింది గ్రామానికి చెందిన పప్పల నాగసాయి (21) అమె భర్త రమేష్‌తో గొడవపడి ఈనెల 26న ఇంట్లో ఎవరికి చెప్పకుండా రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి సాయంత్రం 6 గంటల సమయంలో ఏలూరులో దిగింది. ఆమె ఏలూరు రైల్వేస్టేషన్ 1వ నెంబరు ప్లాట్‌ఫామ్ పై రాత్రి వేళ ఒంటరిగా ఏడుస్తుండగా డ్యూటీలో ఉన్న మహిళా కానిస్టేబుల్ గుర్తించి ఆమెతో మాట్లాడి వెంటనే రైల్వే ఎస్సై పి.సైమన్‌కు సమాచారం ఇచ్చారు. ఆ మహిళతో మాట్లాడి ఆమె పెదనాన్న కర్రి గోవిందు, అన్నయ్య కర్రి చిరంజీవికి ఫోన్‌లో విషయాన్ని తెలిపారు. 26వ తేదీ రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న దిశ వన్‌స్టాప్ సెంటర్‌లో సంరక్షణ నిమిత్తం ఉంచి బుధవారం ఉదయం వారి పెదనాన్న, అన్నయ్య రావడంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించారు.

విద్యార్థులకు కౌన్సెలింగ్

ఏలూరు టౌన్: విద్యార్థి దశలో ఆకతాయిగా ఉంటే వారి భవిష్యత్తు ప్రణాళిక చిన్న భిన్నమవుతుందని ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు అన్నారు. ఏలూరు నగరంలోని బుధవారం రాత్రి సీఐ కోటేశ్వరరావు సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఏలూరు కొత్త బస్టాండ్ కళాశాలల ప్రాంగణాల్లో జంటలుగా ఉన్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. యువత చెడు వ్యసనాలకు బానిసై కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు.

గ్రంథాలయానికి సౌండ్ సిస్టమ్ అందజేత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించే సమావేశాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగపడే నిమిత్తం కొంతమంది దాతలు రూ. 15 వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను బుధవారం బహూకరించారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు తెలిపారు. ఎస్సై వై. రామ్మోహన్, ఉపాధ్యాయులు ఎం.రాంబాబు, కె.నరేష్, కె.రామయ్య, జి.గోపి కిషోర్ తదితరులు సౌండ్ సిస్టమ్ అందించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తికి విద్యుదాఘాతం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు నెహ్రూ కాలనీలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఒక ఇంటికి అనుకుని విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా బుధవారం ఆ ఇంటిలో నివసించే వి.జగదీష్ అనే వ్యక్తికి విద్యుత్ షాక్ తగిలి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. తమ ఇంటికి ఆనుకుని ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా తమ ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని, దానిని అక్కడి నుంచి తొలగించి తమ ప్రాణాలను కాపాడాలని ఆ కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

యువకుడి అరెస్ట్

ఏలూరు టౌన్: పాతకక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిని చాకుతో పొడిచిన యువకుడిని ఏలూరు త్రీ టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై కె.ప్రసాద్ బుధవారం అరెస్టు చేశారు. ఏలూరులోని విజయగార్డెన్స్ 3వ రోడ్డుకు చెందిన రాయి శివయ్యకి ఏలూరు రూరల్ మండలం పాలగూడేనికి చెందిన మేడిబోయిన ఫణీంద్రకు పాతగొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫణీంద్ర అతని స్నేహితుడు బాలు కలిసి ఈనెల 24న రాత్రి సత్రంపాడు నేరెళ్ల హోండా షోరూమ్ రోడ్డులో శివయ్యను చాకుతో పొడిచారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఫణీంద్రను బుధవారం అరెస్టు చేశారు.

ధాన్యం సంరక్షణలో నిమగ్నం



వరి కుప్పలు వేస్తున్న రైతులు



ఆరబెట్టిన ధాన్యాన్ని జాగ్రత్త చేస్తున్న రైతులు

దెందులూరు: వాతావరణ శాఖ రెండు రోజులు వర్ష సూచనలతో పాటు హై అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో గ్రామాల్లోని రైతులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. అన్ని గ్రామాల్లో కోతలు 70 శాతం పూర్తిగా అవడంతో ధాన్యం కళ్లల్లోనూ, రోడ్లపై రాశులుగా ఉంది. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై చలిగాలు వీయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల సూచన మేరకు గోనె సంచులు తీసుకువచ్చి ఆరబెట్టిన ధాన్యాన్ని పట్టుబడి చేస్తూ, కొన్నిచోట్ల రోడ్డుపై ఆరబెడుతూ మరికొన్ని గ్రామాల్లో రాశులుగా పోసి టార్పాలిన్లు కప్పి సంరక్షించే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఇంకొన్ని గ్రామాల్లో బుధవారం రైతులు ధాన్యాన్ని మిల్లులకు చేరవేస్తున్నారు.

ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించండి

గణపవరం: వాయుగుండం హెచ్చరికల దృష్ట్యా రైతులు వరికోతలను వాయిదా వేసుకోవాలని, పొలాల్లో ఉన్న ధాన్యం రాశులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తాడేపల్లిగూడెం డివిజన్ వ్యవసాయాధికారి పి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం ఆయన గణపవరం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి రైతులను కలిశారు. పొలాలు, పుంతల్లో ఉన్న ధాన్యం రాశులను సురక్షిత ప్రదేశాలకు తరలించి, తడవకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

విద్యుత్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశామని ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ పీ. సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైన ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకుగాను ఏలూరులోని జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం, విద్యుత్ భవన్‌లో 9440902926 నెంబర్‌తో 24 గంటలపాటు 3 షిఫ్టుల్లో పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు.

అత్యాచారయత్నంపై విచారణ



గోపన్నపాలెంలో పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న ఎంఈఓ అన్నమ్మ

దెందులూరు: గోపన్నపాలెం శివారు మసీదు పాడులో బాలికపై అదే గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి అత్యాచార యత్నం ఘటనపై జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి విచారణకు ఆదేశించారని దెందులూరు ఎంఈవో కే అన్నమ్మ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో ఎంఈవో విచారణ నిర్వహించారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం, ఉపాధ్యాయులను వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థి హాజరును పరిశీలించారు. అన్ని వివరాలు నమోదు చేసుకుని నివేదికను కలెక్టర్‌కు అందజేశారని విచారణ అధికారి ఎంఈవో అన్నమ్మ వివరించారు. కేసు నమోదు కావడంతో ప్రస్తుతం దెందులూరు పోలీసులు బాలుడిని ఏలూరు జువైనల్ హోమ్‌లో ఉంచారని తెలిపారు.

వ్యాయామ కళాశాలలో సమస్యల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న సర్వశిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిర్మలకుమారి

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలను బుధవారం సర్వశిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిర్మలకుమారి పరిశీలించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నత్తానియేలుతో కలిసి లేడీస్ హాస్టల్, కిచెన్ షెడ్డు, ఇంటర్నల్ రోడ్డు, గ్రౌండ్, కోర్టు నిర్మాణంలో ఉన్న హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కళాశాలకు వచ్చిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పలు అంశాలను పరిశీలించి బుధవారం సాయంత్రం నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వివరించారు. ఇటీవల ఎమ్మెల్యే చింతమనేని, జిల్లా కలెక్టర్ వ్యాయామ కళాశాలను పరిశీలించి సమస్యలను గుర్తించిన నేపథ్యంలో వారి ఆదేశాల అనుగుణంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కళాశాలకు వచ్చి సమస్యలను నివేదిక రూపంలో తీసుకువెళ్లడం సంతోషంగా ఉందని వ్యాయామ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ రత్నబాబు, పీడీ సాయి కోటి సిబ్బంది ఉన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

తహసీల్దార్ బి.రమాదేవి

భీమడోలు: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను పగడ్బందీగా, సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత సబంధిత అధికారులు, సిబ్బందిపై ఉందని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో సాగు నీటి వినియోగదారుల ఎన్నికల సిబ్బందికి బుధవారం ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రవర్తనా నియమావళిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్నికల పరిశీలకులు, భీమడోలు మండల మైనర్ ఇరిగేషన్ ఏఈ కె.లాజర్‌బాబు అధ్యక్షత వహించారు. ఎన్నికల నిర్వహణపై ట్రైనీ మాస్టర్లు ఎం.శరీన్, వి.జగదీష్ సిబ్బందికి అవగాహన కల్పించారు. తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 11 మైనర్, మేజర్ సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల జరుగనున్నాయన్నారు. 20,528 మంది రైతులు ఓటర్లగా నమోదయ్యారని తెలిపారు. ఎన్నికల్లో నామినేషన్లు వేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఈనెల 5వ తేదీగా నీటి పన్ను చెల్లించాలని, లేని పక్షంలో వారి నామినేషన్‌ను తిరస్కరిస్తామన్నారు. ఎన్నికల పరిశీలకుడు కె.లాజర్ మాట్లాడుతూ మండలంలోని గుండుగొలను, పూళ్ల, భీమడోలు, అంబర్‌పేట, ఆగడాలలంక, చెట్టున్నపాడు మేజర్, 5 మైనర్ సాగునీటి సంఘాలకు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల సిబ్బంది చిత్తశుద్ధితో, జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, 200 మంది శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కిరణకుమారి, వీఆర్వోలు వినయ్, శంకర్, డి.సింహాచలం, గ్రామకార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	31
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు – తిరుపతి	16.00	4830	29

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	50	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	36	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07, 10
బెండకాయలు	34	కంద	80
పచ్చిమిర్చి	24–28	బీట్‌రూట్	60
కాకర కాయలు	30–36	కీరా దోస	36
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	72
బీరకాయలు (పందిరి)	44	అల్లం	70
క్యాబేజీ	36–40	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	72	పాలకూర	10
దొండకాయలు	34	చుక్కకూర	12
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36–55	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	24–28	బఠాణి	--
ఆనపకాయ (1)	20–25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	44